బెంబేలెత్తిస్తున్న షాపుల అద్దెలు

- రోజంతా కష్టపడితే అద్దెలు, జీతాలకు సరిపోతుందని వ్యాపారుల ఆవేదన
- అద్దెల విషయంలో వెనక్కి తగ్గని యజమానులు....



పాలకొల్లుమెయిన్ రోడ్డు గోల్డ్ మార్కెట్‌లోని షాపులు

పాలకొల్లు సెంట్రల్: ప్రతి వ్యక్తి తన జీవనోపాది కోసం ఏదైనా ప్రభుత్వం లేక ప్రైవేటు ఉద్యోగం చేయాలి లేదంటే వ్యాపారమైనా చేయాలి. కార్మికుడిలా అయినా కష్టపడాలి. నేడు పోటీ సమాజంలో ప్రభుత్వ ఉద్యోగాలనేవి అతి కష్టమైన అంశం. ప్రైవేటు ఉద్యోగాల్లో కూడా పోటీ పెరిగిపోవడంతో విసుగు చెందిన యువత సొంతంగా ఏదో వ్యాపారం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా సొంత వ్యాపారాలు చేయాలంటే ఏదైనా మంచి సెంటర్లో షాపు తీసుకుని సరైన వ్యాపారం ఎంపిక చేసుకుని స్వయంకృషితో ఎదగాలనుకుంటున్నారు. కానీ ప్రస్తుతం మార్కెట్లో షాపు అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి ప్రధాన కారణం సెల్‌ఫోన్ కంపెనీలు, గోల్డ్ మార్కెట్‌లు అని వ్యాపారస్తులు అంటున్నారు. సాధారణంగా పట్టణ ప్రధాన రహదారుల్లో ఓ పదిహేనేళ్ల క్రితం వరకూ రూ.5 వేల నుంచి 15 వేలు వరకూ షాపులు సైజును బట్టి అద్దెలు ఉండేవి. అనంతరం క్రమేపీ పెరుగుతూ ఉండేవి. ఎప్పుడైతే సెల్‌ఫోన్ కంపెనీలు, గోల్డ్ మార్కెట్‌లు పెరిగాయో ఒక్కో షాపు అద్దె రూ. 40 వేలు, రూ. 60 వేలు వరకూ పెరిగిపోయాయి. దీనివల్ల చిరు వ్యాపారం చేసుకుందామనుకునే వ్యాపారస్తులకు అద్దెకు షాపులు దొరకడమే కష్టమైపోయాయి. ఒకవేళ ఏదైనా షాపు దొరికినా అద్దెలు చూసి కొత్తగా వ్యాపారాలు చేయాలనుకునే వ్యక్తులు బేజారెత్తిపోతున్నారు. రోజంతా కష్టపడి అద్దెలు, జీతాలు ఇచ్చే సరికి వ్యాపారం లాభాల బాట దేవుడెరుగు ఎదురు అప్పులు చేసి వడ్డీలు కట్టి దివాల తీసే పరిస్థితి వస్తుందని భయపడుతున్నారు.

తగ్గేదేలే అంటున్న భవన యజమానులు

పట్టణంలో కొందరు భవన యజమానులు అద్దెల విషయంలో అసలు వెనక్కితగ్గడం లేదు. పట్టణంలో ఓ భవన యజమాని మూడు ఫ్లోర్‌ల భవనాన్ని నిర్మించి సుమారు ఏడేళ్లు కావస్తుంది. ఇప్పటికీ ఆ భవనాన్ని అద్దెకు ఇవ్వలేదు. గతంలో ఒక వ్యాపారి వెళ్లి అడగ్గా మొత్తం భవనం అద్దె సుమారు రూ. 1.50 లక్షలు చెప్పినట్లు సమాచారం. గ్రౌండ్ ఫ్లోర్ ఒక్కటే అడిగితే దాదాపుగా రూ. 65 వేలు చెప్పినట్లు తెలిసింది. దీంతో ఏళ్లుగా ఆ భవనం ఖాళీగానే ఉంటుంది. తమ భవనాలు ఖాళీగా అయిన పెట్టుకోవడానికి అయినా ఇష్టపడుతున్నారు తప్ప అద్దెలు తగ్గించాలనే విషయాన్ని మాత్రం పెడచెవిన పెడుతున్నారు.

సోషల్ మీడియాలో ప్రచారం

పట్టణంలో అద్దెల దెబ్బకు ఔత్సాహిక యువ వ్యాపారవేత్తలు తక్కువ అద్దెలు ఉన్న ప్రాంతాల్లో షాపులు ఓపెన్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు. ముఖ్యంగా ప్రతి రోజూ రీల్స్ చేస్తూ ఆఫర్లు ఇస్తున్నామంటూ పేర్కొంటున్నారు. మార్కెట్ ధరల కంటే తక్కువకు అందిస్తే కస్టమర్లను ఆకట్టుకోవచ్చని యువ వ్యాపారవేత్తలు చెబుతున్నారు. ఇలాంటి యువత పట్టణ శివారుల్లో, చిన్న చిన్న సందుల్లో షాపులు పెట్టుకుంటున్నారు. అయితే ప్రస్తుతం బైపాస్ రోడ్డుల్లో ఫంక్షన్ హాల్స్, ఆసుపత్రులు, విద్యా సంస్థలు పెరిగిపోవడంతో అక్కడ కూడా అద్దెలు అందనంత ఎత్తులోకి చేరుకున్నాయని వ్యాపారస్తులు వాపోతున్నారు.

దొంగలు, ట్రాఫిక్ సమస్యలు

అద్దెల దెబ్బకు శివారు ప్రాంతాల్లో షాపులు పెట్టుకున్నా దొంగల భయం వేధిస్తుందని వ్యాపారులు వాపోతున్నారు. చిన్న చిన్న సందుల్లో కూడా వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతుందనిపేర్కొంటున్నారు. చిన్న సెంటర్లలో, ఊరి చివర్లలో బడ్డీల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారస్తులు సీసీ కెమెరాలు పెట్టుకునే స్థోమత ఉండడం లేదు. ఇటీవల మారుతి సెంటర్లో బడ్డీ కొట్లలో వ్యాపారాలు చేసుకునే సోడా షాపులను దోపిడి చేస్తున్నారు. ఆ షాపుల్లో ఖరీదైన వస్తువులు సిగరెట్లు, డ్రింక్‌లు వాటిని దొంగిలించడానికి బడ్డీల డోర్‌లను పెకలించి దోచుకుపోతున్నారు. ఈ సంఘటనలతో చిరు వ్యాపారస్తులు ఆవేదనకు గురవుతున్నారు.

షాపుల అద్దెలతో కంగారు



ప్రస్తుతం షాపు అద్దెలు చూసి కంగారు వస్తుంది. వ్యాపారం ప్రారంభించి నాలుగేళ్లు కావస్తుంది. వ్యాపారం ప్రారంభించడానికి ముందుగా మార్కెట్లో ఓ షాపు అడిగాను గ్రౌండ్ ఫ్లోర్‌లో రూ.70 వేలు చెప్పారు. నా వ్యాపారానికి తగ్గట్లు రూ. 15 వేలలో షాపు చూసుకుని వ్యాపారం చేస్తున్నాను. మా షాపు యజమాని ఆదాయం కోసం కాకుండా వ్యాపారం అభివృద్ధి చెందాలని కోరుకునే వ్యక్తి కాబట్టి తక్కువ అద్దెలో మెయిన్ రోడ్డులో వ్యాపారం చేసుకుంటున్నాను.

– నంబూరి స్వామి, సిల్వర్ షాపు, పాలకొల్లు

జీఎస్టీ బాధ కూడా మాదే



నేను సెల్‌ఫోన్ షోరూమ్ పెట్టి దాదాపుగా 20 ఏళ్లు కావస్తుంది. అప్పట్లో చాలా తక్కువ అద్దె ఉండేది. ప్రస్తుతం రూ.34 వేలు ఇస్తున్నాం. జీఎస్టీ కూడా మేమే కట్టుకోవాలి. షోరూము పెంచాలని చూస్తున్నా అద్దెలు భారీగా చెబుతున్నారు. ముఖ్యంగా ఇంతంత అద్దెలు చెల్లిస్తున్నా సరైన పార్కింగ్ సౌకర్యం ఉండడం లేదు.

– బోనగిరి కుమార్, సెల్ షాపు, పాలకొల్లు

క్లుప్తంగా

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ



పార్టీ పీఏసీ సభ్యుడు సజ్జల, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లతో నాయకులు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పీఏసీ సభ్యుడు సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ బీసీసెల్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌లను నరసాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు అంశాలపై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్రవీరన్న, అగ్నికుల క్షత్రియ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ చైర్మన్ తిరుమాని నాగరాజు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దొంగ మురళీకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రి ఏసుబాబు ఉన్నారు.

సమాజ సేవతో సంతృప్తి

నరసాపురం: సమాజసేవలో సంతృప్తి ఉంటుందని రాష్ట్ర మాదిగ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు, షాలేమ్ సామాజిక సేవా సంస్థ చైర్మన్ తెన్నేటి సురేష్ అన్నారు. శనివారం సంస్థతరపున పట్టణంలోని 1వ వార్డు లాకుపేటలో వితంతువులు, పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రత్నకుమారి, బలువూరి సునీత, మర్రి సత్తిబాబు, సిర్రా శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

నరసాపురం: క్రీస్తు సందేశాలు శాంతిని ప్రబోధిస్తాయని నరసాపురం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బి.రత్నరాజు అన్నారు. సంజయ్ కిషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఈస్టర్ ముందురోజు నిర్వహించే రన్‌ఫర్ జీసస్ 10కేరన్ కార్యక్రమం శనివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. థామస్ బ్రిడ్జి వద్ద నుంచి వేములదీవి తదితర గ్రామాల్లో మోటార్‌సైకిళ్లపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు పాటించడం ద్వారా మంచి నడవడిక అలవడుతుందని అన్నారు. కార్యక్రమలో సికలే పెర్సిపాల్, వై.రూబెన్, అజరయ్య జాన్, డేనియల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో జల్ పక్వాడా

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచంలో ఏ దేశమైనా సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే నీరు చాలా ముఖ్యమైనదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో జల్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వీధుల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. భవానీప్రసాద్ మాట్లాడుతూ నీటిని వృథా చేయకూడదన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కరణం పాపారావు, ఉపాధ్యాయులు చంద్రకళ, శశికళ, భవానీదుర్గ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. శనివారం పోషణ్ పక్వాడా, స్వర్ణాంధ్రా స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పెదపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం, ఎలక్ట్రికల్ వేస్ట్ మెటీరియల్‌పై అవగాహన కల్పించారు. సత్యవేణి మాట్లాడుతూ పాత ట్యూబ్‌లైట్లు, చార్జర్స్, ఇతర ఎలక్ట్రికల్ వేస్ట్ సామాగ్రిని ఎక్కడ పడితే అక్కడ పడేయకూడదని అన్నారు. కార్యక్రమంలో సౌమ్య, పెద్దిలక్ష్మి, సుజాత, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ వైద్యురాలి మృతి



వల్లూరి నళిని

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ వల్లూరి నళిని (59) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈమెకు భర్త, కుమార్తె ఉన్నారు. శుక్రవారం రాత్రి ఆకస్మికంగా పడిపోవడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లేలోపు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నళిని మృతి పట్ల పాలకొల్లు, నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు రవికుమార్, సుప్రియ, వైద్యులు డాక్టర్ వర్మ, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ సంతోష్‌కుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

జాగ్రత్తలతో అగ్నిప్రమాదాల నివారణ



నరసాపురం: అగ్నిప్రమాదాలపై సూర్యా ఆసుపత్రిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసాపురం: తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని నరసాపురం అగ్నిమాపకశాఖ అధికారి కె.భాస్కరరామ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యా ఆసుపత్రి వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలోనూ సమయస్ఫూర్తితో స్పందించాలని సహాయ జిల్లా అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణ ప్రభుత్వ హాస్పటల్లో, ఏఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాక్ డ్రిల్ చేసి అగ్ని ప్రమాదాల నివారణప అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న జయసరిత

పాలకొల్లు సెంట్రల్: వేసవిలో ఎండలు మండుతున్నాయంటే పేద ప్రజల ఇళ్లల్లో గ్యాస్ మంటలు మండుతుండడంతో పేద ప్రజలు మరింత ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని రాష్ట్ర వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్యాస్ మంటలతోపాటు గ్యాస్ మాటలు కూడా చెపుతున్నారన్నారు. ఉచిత గ్యాస్ పేరు చెప్పి మీ ఖాతాల్లో నగదు పడిపోతుందని కల్లబొల్లి మాటలు చెప్పారన్నారు. ఎందరో పేద ప్రజలు గ్యాస్ డబ్బులు కోసం బ్యాంకులకు వెళితే మీ అకౌంట్‌లో డబ్బులు పడలేదని అంటున్నారన్నారు. దీనిపై తహసీల్దార్, గ్యాస్ కంపెనీల యజమానులను అడిగితే ఈకేవైసీ అయ్యిందని చెబుతున్నారన్నారు. ఇలా డొంక తిరుగుడు మాటలతో కూటమి ప్రభుత్వం పబ్బం గడుపుకుంటుందన్నారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోగాడ ఉమామహేశ్వరరావు, గొర్రెల రాంబాబు, మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జున, రాజు, హేమలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినంధిస్తున్న దృశ్యం

నరసాపురం: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని శ్రీసూర్యా కళాశాల విద్యార్థులు 9 మంది మంచి మార్కులతో జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారని కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ చెప్పారు. చామన ఉషశ్రీ, పోలిశెట్టి ఏసమ్మ, పోతాబత్తుల మానసతులసి, అందే త్రినాథ్, రావి వినయలక్ష్మి, కొత్త భవ్య, ఒడుగు అభిషై, యర్రంశెట్టి సాయిదుర్గ, కొల్లాటి భవానీ ప్రతిభ చూపించారని చెప్పారు. విద్యార్థులను సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ ఏఆర్‌ఎస్ కుమార్, డాక్టర్ ఫాజిల్, బి.రామచంద్రారెడ్డి అభినందించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

శ్రీ సూర్యా పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యురాలు ఎం.పద్మావతి, స్కూల్ కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, అకడమిక్ డైరెక్టర్ హేమవల్లి, ప్రిన్సిపాల్ బి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం



వేములదీవి గొంది మూలలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు శనివారం ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ, సహోపాధ్యాయులు, గ్రామస్తులతో కలసి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం గ్రామంలోని గొందిమూల ప్రాథమిక పాఠశా నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంరం 15 మంది విద్యార్థులను పాఠశాలలో నమోదు చేశారు. కార్యక్రమంలో సౌజన్య, రామచంద్రరావు, విద్యాకమిటీ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ముదునూరి పరామర్శ



ఉపాధి కూలీల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఉపాధి కూలీల కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు శనివారం పరామర్శించారు. మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలేనికి చెందిన ఉపాధికూలీల పైకి మినీ వ్యాన్ దూసుకువెళ్లిన ఘటనలో కడలి పావని, గుబ్బల గంగావతి, గుబ్బల మాణిక్యాలరావులు మృతి చెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు బాధిత కుటుంబ సభ్యులను పరిమర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం కుక్కల వారి తోటలో మృతి చెందిన వనం శ్రీహరి కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, నాయకులు రేవు రాంబాబు, పడవల సత్యనారాయణ, కుక్కల కృష్ణమోహన్, కర్రి ఏసుబాబు, రేవు నారాయణ మూర్తి, కుక్కల సోమేశ్వరరావు, కోనాల ప్రసాద్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె



సమ్మెనోటీసు అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌లు

పెనుగొండ: సమస్యల పరిష్కరించకపోతే 10 రోజుల్లో సమ్మెకు వెళ్తామంటూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం నాయకులు శనివారం ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తికి సమ్మె నోటీసు అందించారు. కనీస వేతనం అమలు చేయాలని, సామాజిక తనిఖీల పేరుతో మానసిక ఇబ్బందులకు గురి చేయడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని వినతిపత్రం సమర్పించారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

నరసాపురం రూరల్: ఉపాధిహామీ పనులు చేసిన కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. శనివారం వేములదీవి తూర్పు గ్రామంలో ఉపాధి కూలీలతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. తిరుమాని కనకరాజు, తిరుమాని వీర్ల వెంకయ్య, బస్వాని భీమరాజు, తిరుమాని పెద్దింట్లమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని 9,10,31 వార్డుల్లో శనివారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపనలు చేశారు. వార్డుల్లో సీసీరోడ్లు నిర్మాణం, ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన భవన ప్రాంగణానికి సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే పశువుల ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డాగ్ స్టెరిలైజేషన్ షెడ్, ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఎన్టీఆర్ టిడ్కో గృహాల కాలనీ ప్రాంతంలో నరసాపురం ప్రధాన కాలువపై నిర్మించనున్న కాలిబాట వంతెన ప్రదేశాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, పెచ్చెట్టి బాబు, జివి, కర్నేన గౌరునాయుడు, రోజారమణి, యర్రంశెట్టి పద్మారావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పెనుగొండ: ఆచంటలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



యలమంచిలి: ప్రజల నుంచి ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలను సేకరిస్తున్న అధికారులు

పెనుగొండ: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేయడం ద్వారా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రా సాధనకు కృషి చేయాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ పిలుపు నిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రా సాధన కార్యక్రమంలో భాగంగా ఆచంట ఎస్‌బీఐ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. ప్రజలు ఈ-వేస్ట్‌ను బాధ్యతగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ మండలంలో

పెనుగొండ పంచాయతీలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించి చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.రత్నాకరరావు పాల్గొన్నారు. సిద్ధాంతంలో ఈ-వేస్ట్ సెంటర్‌ను సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి) ప్రారంభించారు. ఈ వేస్ట్‌ను తప్పనిసరిగా కలెక్షన్ సెంటర్‌కు అప్పగించాలని కోరారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మానవాళి మనుగడకు హానికరంగా మారిన ఈ వ్యర్థాలను శాస్త్రీయంగా నశింపజేయాలని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత కోరారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయాల వద్ద ప్రజల నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం వద్ద ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు కియోస్కులు, డ్రమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పాడైన ఎలక్ట్రానిక్ వస్తువులను బయట పడేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతున్న నేపథ్యంలో ప్రజలు పాడైన వస్తువులను బయట వేయకుండా పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కియోస్కులు, డ్రమ్‌లు వేయాలని ఆయన కోరారు. ఈ విషయంలో ప్రజలను చైతన్య పరిచేందుకు ప్రతి నెలా మూడో శనివారం గ్రామాలలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి నెలలో మూడవ శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం గోశాలలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలి



జైలులో ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాస్

నరసాపురం: రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయ కేంద్రం ద్వారా అందే సేవలు సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం జూనియర్ సివిల్‌జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. శనివారం జడ్జి స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి కేసుల వివరాలు తెలసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెయిల్‌కోసం న్యాయవాదిని నియమించుకుకోలేని వారు ఈ సహాయ కేంద్రాల ద్వారా ఉచిత సహాయం పొందవచ్చని చెప్పారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు ఉన్నారు.

10న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: రాజీ ఆమోదయోగ్యమైన కేసులు పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందని ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియావుద్దీన్ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో పోలీసులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జియావుద్దీన్ మాట్లాడుతూ మే 10న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించి కేసులు పరిష్కరించుకునే విధంగా కృషి చేయాలన్నారు. స్టేషన్లో పెండింగ్‌లో ఉన్న కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు.